స్తంభాలు తీయరు.. రోడ్డు వేయరు

- గందరగోళంగా జవహర్‌నగర్ ప్రధాన రహదారి విస్తరణ పనులు
- అసంపూర్తి పనులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని జవహర్‌నగర్ పాలకవర్గం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారిపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు వామ్మో అనాల్సిందే. 100 ఫీట్ల డబుల్ రోడ్డుతో పాటు డివైడర్ రోడ్డు (సెంట్రల్ లైటింగ్ సిస్టమ్) పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి రహదారి పనులు పూర్తి కాకపోవడంతో ఈ రహదారి గుండా వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. చేసేది లేక అడ్డదారుల్లో ప్రయాణం చేస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను ఇప్పటికీ తొలగించకపోవడం గమనార్హం.


జవహర్‌నగర్‌లో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ టవర్లు, స్తంభాలు

ఎన్నికల సమయంలో హామీ..

◆ ఎన్నికల సమయంలో రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి జవహర్‌నగర్‌లో 100 ఫీట్ల రోడ్డును వేసి దశ దిశలు మారుస్తామని పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌తో కలిసి హామీ ఇచ్చారు. తాజాగా ఏర్పడిన కార్పొరేషన్ పాలవర్గం సైతం 100 ఫీట్ల డబుల్ రోడ్డుతో డివైడర్ రోడ్డు (సెంట్రల్ లైటింగ్ సిస్టమ్) వేసి హోదా కల్పిస్తామని తీర్మానం చేసి హడావిడి చేసింది. దీని కోసం ప్రభుత్వం రూ. 8.20కోట్లు మంజూరు చేసింది.

తాజాగా మరో రూ.4కోట్లు

◆ జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రధాన రహదారి రోడ్డు నిర్మాణ నిమిత్తం ''చెన్నాపురం నుంచి యాప్రాల్ సికింద్రాబాద్, యప్రాల్ నుంచి నాగారం, కీసర, కుషాయిగూడ ప్రధాన రహదారి నిర్మాణానికి ప్రభుత్వం గతంలో రూ.8.20 కోట్లు మంజూరు చేసింది. సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేయడంతో తాజాగా ప్రభుత్వం మరో రూ.4కోట్లను మంజూరు చేసింది.



100 ఫీట్లకు మార్కింగ్.. 55 ఫీట్లకే రోడ్డు

◆ అనంతరం రోడ్డు నిర్మాణానికి రోడ్డుకు ఇరువైపులా 100 ఫీట్లకు మార్కింగ్ చేశారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మాత్రం కేవలం 55 ఫీట్లకే రోడ్డు పనులను ప్రారంభించారు. దీంతో ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో మళ్లీ 85 ఫీట్ల రోడ్డు డివైడర్ వేస్తామని హామీ ఇచ్చి పనులను మధ్యలోనే నిలిపివేశారు. పదికాలాల పాటు ఉండాల్సిన రహదారి నిర్మాణ పనులు పాలకుల అలసత్వం, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి.

భవిష్యత్‌లో తప్పని ఇబ్బందులు

◆ జనాభా పరంగా రెండు లక్షలకు పైగా ఉన్న జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రధాన రహదారిని 100ఫీట్లకు విస్తరిస్తేనే భవిష్యత్‌లో ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తవని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. 55ఫీట్లకు ఎందుకు కుదించారో అధికారులు, ప్రజాప్రతినిధులకే తెలియాలని అంటున్నారు. భవిష్యత్‌లో మళ్లీ రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఏర్పడుతుంది.. అప్పుడు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం లేకపోలేదని అంటున్నారు. ఇప్పుడే 100 ఫీట్లకు విస్తరిస్తే భవిష్యత్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రధాన రహదారిని 100 ఫీట్లకు విస్తరించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మధ్యలోనే వదిలేశారు

◆ గతంలో పనులు దగ్గించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారభించి హడావిడి చేసి రోడ్డు మధ్యలో డివైడర్ వేసి ప్రస్తుతం ఆ డివైడర్‌ను సైతం పగులగొట్టి ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశాడు. దీంతో రహదారి మొత్తం కంకర తేలి దుమ్ము ధూళితో అటు దుకాణ యజమానులు, ఇళ్లలో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తొలగించని విద్యుత్ స్తంభాలు

◆ జవహర్‌నగర్‌లోని ప్రధాన రహదారిలో ప్రస్తుతం 42 విద్యుత్ టవర్లు ఉన్నాయి. అదే విధంగా 16 విద్యుత్ స్తంభాలున్నాయి. వాటిని పక్కకు తొలగించి పెట్టకముందే సదరు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. పేరుకే రోడ్డు వెడల్పు కార్యక్రమం అంటున్నారు 55 ఫీట్ల నుంచి 35 ఫీట్ల రోడ్డు వేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు నాణ్యతతో పనులు జరిగేలా చూడాలని కోరుతున్నారు. దీనికిపై కమిషనర్ రామలింగంను వివరణ కోరగా పనుల్లో నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనల ప్రకారం ప్రమాణాలు పాటించుకుంటే పనులను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

100 ఫీట్లు ఉత్తి మాటేనా.?



జవహర్‌గనర్‌లో నిత్యం వేలది మంది వాహనాలు రాకపోకలు నిర్వహిస్తారు. కార్పొరేషన్ స్థాయికి తగ్గట్టు 100 ఫీట్ల రోడ్డుతో డివైడర్ ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కేవలం కాంట్రాక్టర్ డబ్బుల కోసం నామమాత్రంగా 55 నుంచి 35 ఫీట్ల రోడ్డు వేయడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమే. ఇప్పటికైనా మంత్రి మల్లారెడ్డి చొరవ తీసుకుని రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలి.

– జంగిడి శ్రీనివాస్, ఏఐఎఫ్‌బీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి

గతంలో ఏ ప్రభుత్వం చేయలేదు..



జవహర్‌నగర్ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. గతంలో ఎప్పుడులేని అభివృద్ధి ఇప్పుడు జరుగుతోంది. కొందరు కావాలనే ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. ఇచ్చిన ప్రతి హామీని మంత్రి మల్లారెడ్డి తప్పకుండా నెరవేరుస్తారు. మరో రెండు నెలల్లో రోడ్డు పనులు పూర్తవుతాయి. ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– రెడ్డిశెట్టి శ్రీనివాస్, జవహర్‌నగర్ డిప్యూటీ మేయర్

రెండు రోజుల్లో సమస్య తీరుతుంది..



జవహర్‌నగర్ పట్టణ రూపురేకలను మార్చడానికి మంత్రి మల్లారెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారు. మంత్రి కేటీఆర్ సహకారంతో రోడ్డు వెడల్పు పనుల కోసం గతంలో రూ.8.20 లక్షలు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనిని మధ్యలోనే వదిలివెళ్లాడు. దీంతో మంత్రి మల్లారెడ్డి మరో రూ.4 కోట్లను మంజూరు చేయించి రోడ్డు పనులను చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తీసివేయాలి. నెల రోజులుగా అధికారులతో మాట్లాడుతున్నాం. ఈ విషయంలో వారు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేయలేకపోతున్నారు. ఒకటి రెండు రోజుల్లో సమస్య తీరుతుంది.

– మేకల కావ్య, జవహర్‌నగర్ మేయర్

క్లుప్తంగా

పచ్చదనం పెంపొందించాలి



శామీర్‌పేట్: పర్యావరణలో పచ్చదనాన్ని పెంచాలని తెలంగాణ గవర్నర్ తమిళి సై అన్నారు. శామీర్‌పేట్ మండల కేంద్రంలోని సెలబ్రిటీ రిసార్ట్స్‌ను గవర్నర్ శుక్రవారం సందర్శించారు. రిసార్ట్స్‌లోని పచ్చదనాన్ని పరిశీలించారు. అనంతరం మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముందు తరాలకు మంచి పర్యావరణం అందించడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ హ్యారి జోసెఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

మేడ్చల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 4న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రజిరాజమల్లారెడ్డి, ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సకాలంలో హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల మండల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరై సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు, తమ శాకల పురోగతిపై వివరించాలని కోరారు.

ఐడీసీఏ క్రికెట్ టోర్నీ విజేత నార్త్ జోన్


నార్త్ జోన్ జట్టు సభ్యులు

ఘట్‌కేసర్: ఐడీసీఏ వన్ డే నేషనల్ జోన్ క్రికెట్ చాంపియన్‌షిప్ ఫర్ ట్రోఫీ విజేతగా నార్త్ జోన్ నిలిచింది. కాచవానిసింగారం బాబురావు సాగర్ క్రికెట్ గ్రౌండ్‌లో నార్త్, సౌత్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ జోన్‌లు లీగ్ పద్ధతిలో పోటీపడగా నార్త్, సౌత్ జోన్‌లు ఫైనల్‌కు చేరుకున్నాయి. శుక్రవారం తుదిపోరులో నార్త్ జోన్ టీమ్ విజయం సాధించింది. ముఖ్య అతిథులుగా ఐఎన్‌డీఐసీ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ అశీశ్ నారెడి, ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో హెడ్ కమ్యూనికేషన్ ఆనందిత సిన్హా హాజరై ట్రోఫీ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు దుబాయ్‌లో జరగనున్న మూగ, చెవిటి క్రీడాకారుల వరల్డ్ కప్‌లో ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.

వైఎస్‌ఆర్‌టీపీ మేడ్చల్ కోఆర్డినేటర్‌గా పాకాల

జవహర్‌నగర్: వైఎస్‌ఆర్‌టీపీ మేడ్చల్ నియోజకవర్గ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా పాకాల డానియేల్ నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆయనకు శుక్రవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డానియేల్ మాట్లాడుతూ.. మేడ్చల్ నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, అధికార పార్టీ నాయకులు ప్రశ్నించేవారిపై కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. తన మీద నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తానని ఆయన అన్నారు.

గ్యాస్ ధర పెంపుపై సీపీఐ నిరసన



జవహర్‌నగర్: గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశ ప్రజలను దోచుకుంటున్నారన్నారు. రెండేళ్లుగా వంట గ్యాస్ ధరలను రూ.500 పెంచి కార్పొరేట్ సంస్థలకు పేదల సొమ్మును దోచిపెడుతున్నారని మండిపడ్డారు. తక్షణమే గ్యాస్ ధర తగ్గించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ కాప్రా మండల కార్యదర్శి యాదగిరి, నాయకులు స్వరూప, రవి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్: మేడ్చల్ న్యాయస్థానాల భవన సముదాయంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని న్యాయమూర్తి డి.వెంకటేష్ ప్రారంభించారు. శిబిరంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శివకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

మేడ్చల్: నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ గతంలో ఏం చేసింది, తిరిగి అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో హాత్ సే హాత్ జోడో యాత్రలో వివరిస్తున్నట్లు పీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. జోడో యాత్రలో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ జ్ఞానాపూర్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో మేడ్చల్ నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నామన్నారు. ఎమ్మెల్యేగా మంత్రి మల్లారెడ్డి ఎప్పుడూ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. యాత్ర సందర్భంగా జ్ఞానాపూర్‌కు చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి సురేందర్‌ముదిరాజ్, ఎస్.మల్లేష్, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న కీసర సర్పంచ్ మాధురి

కీసర: కీసర గ్రామానికి చెందిన జూపల్లిసత్తమ్మ తనయుడికి, వన్నిగూడంకు చెందిన కృష్ణారావులకు రూ.60వేల చొప్పున సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు కీసర సర్పంచ్ మాధురి శుక్రవారం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మణ్, బీఆర్‌ఎస్ నేతలు బాల్‌రాజ్, గణేష్, సుమన్ బన్ని, పరమేష్, మహేష్, వెంకటేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యాచకుడి మృతి

ఘట్‌కేసర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అవుషాపూర్ సర్వీస్ రోడ్డులో హెచ్‌పీసీఎల్ వద్ద 30 నుంచి 40 ఏళ్ల వయసున్న యాచకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం 108 వాహనంలో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి


ఒప్పంద పత్రం తీసుకుంటున్న కమిషనర్ రాములు

పోచారం: అన్నోజిగూడలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు కుక్కల దాడులపై చైర్మన్ కొండల్‌రెడ్డి శుక్రవారం అవగాహన కల్పించారు. కుక్కలు కరవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ సురేష్, డాక్టర్ శోభన, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ శివారెడ్డి, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలపై వాల్‌పోస్టర్..

కీసర: కుక్కకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాగారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ ఆవిష్కరించారు. ఇందులో కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్లూ క్రాస్ సొసైటీతో ఒప్పందం..

మేడ్చల్: గుండ్లపోచంపల్లిలో మున్సిపాలిటీ పరిధిలో జంతు జనన నియంత్రణ కోసం, యాంటీ రేబిస్ టీకాల కోసం బ్లూ క్రాస్ సొసైటీతో ఒప్పందం కదుర్చుకున్నట్లు కమిషనర్ రాములు తెలిపారు. మున్సిపల్ కార్యాయలంలో చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించి ఒప్పంద పత్రాలు మార్చుకున్నట్లు ఆయన తెలిపారు. కుక్కల సమస్యను, కుక్క కాటు ఘటనలు తగ్గించడానికి బ్లూక్రాస్‌తో ఒప్పందం చేసుకున్నుట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'మెరుగైన పాలన అందించడంలో బీఆర్‌ఎస్ విఫలం'


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో బీఆర్‌ఎస్ సర్కార్ విఫలమైందని ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అరుణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పల్లె దవాఖానాలో వైద్యం, మందులు అందుబాటులో లేవన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది, పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేక పేద విద్యార్థులు చదువు కుంటుపడుతుందన్నారు. రెండు పడకల ఇళ్లు, రేషన్ కార్డుల ఇవ్వడం లేదని విమర్శించారు. సమావేశంలో ఎంపీడీఓ అరుణారెడ్డి, ఎంపీఓ నందకిశోర్, నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుడు ఎబ్బాల్, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి అండగా ఉంటాం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత హరివర్ధన్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల హక్కుల సాధన ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట రెండో రోజు శుక్రవారం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల ఆందోళన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్న ఐసీడీఎస్‌ను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీలను గాలికి వదిలేసిందని హరివర్ధన్‌రెడ్డి అన్నారు. వారి సమస్యలను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఉన్నికృష్ణ, చంద్రశేఖర్, అశోక్, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

ఘట్‌కేసర్: తాటి చెట్టుపై నుంచి ఓ గీత కార్మికుడు ప్రమాదవశాత్తుపడి మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో శుక్రవారం జరిగింది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అవుషాపూర్ గ్రామానికి బబ్బూరి అశోక్‌గౌడ్(38) శుక్రవారం సాయంత్రం కల్లు సేకరిండడానికి తాటి చెట్టుపైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారీ కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు అతడిని జోడిమెట్లలోని క్యూర్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీజేపీ సంబరాలు

ఘట్‌కేసర్: దేశంలో బీజేపీకి ఎదురు లేదని, రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి అధికారం ఖాయమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు హనుమాన్, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామతీర్థ, రవీందర్‌రెడ్డి, శ్రీశైలం, ప్రభంజన్, మహిపాల్‌రెడ్డి, పవన్, రవిశంకర్, విక్రాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



గౌడవెల్లిలో 1380 మందికి కంటి పరీక్షలు


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సర్పంచ్

మేడ్చల్: కంటి వెలుగులో భాగంగా మండలంలోని గౌడవెల్లిలో 1380 మందికి కంటి పరీక్షలు చేశారని గ్రామ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్యులు, కంటి వెలుగు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. 1380 మందికి పరీక్షలు చేసి 1210 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు సురేందర్ తెలిపారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ వెరోనిక, సిబ్బంది మరియమ్మ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ ద్వాక్రా భవన్‌లో శుక్రవారం కార్పొరేటర్ శారదామనోధర్ రెడ్డి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ధర్నాల పేరుతో బీఆర్‌ఎస్ డ్రామాలు'


మాట్లాడుతున్న విక్రంరెడ్డి

ఘట్‌కేసర్: బీజేపీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అబద్ధపు ప్రచారాలు చేయడం ఆర్థిక మంత్రి స్థాయి దిగజార్చే విధంగా ఉందని బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఆర్టీసీ, విద్యుత్, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచి బీజేపీని విమర్శించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల ఆత్మహత్యల దృష్టి మరల్చడానికే ధర్నాల పేరుతో డ్రామాలాడుతున్నారని విమర్శించారు. బీజేపీ మున్సిపల్, మండల అధ్యక్షుడు హనుమాన్, ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు కేంద్రం పూర్తి చేసినా రాష్ట్ర సర్కారు నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. దేశ ప్రజలందరికి వ్యాక్సిన్ ఉచితంగా ఇస్తే తెలంగాణ ప్రభుత్వం వాటితో వ్యాపారం చేసుకుందని, కేంద్రం రెండేళ్లుగా రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామోజీ, శ్రీరాములు, మహిపాల్‌రెడ్డి, రామతీర్థ, రవీందర్‌రెడ్డి, రవిశంకర్, పవన్, శ్రీశైలం, రఘు, విక్రాంత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుసంధానంతో అదనపు ప్రయోజనం

- ఆయుష్మాన్ భారత్–ఆరోగ్యశ్రీ అనుసంధానానికి చర్యలు ముమ్మరం
- తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారంతా అర్హులే
- నమోదుకు 31 వరకు గడువు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ ద్వారా తెల్లరేషన్ కార్డు (ఫుడ్ సెక్యూరిటీ కార్డు) కలిగిన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల వరకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు పొందడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు ముమ్మరం చేశాయి. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద రూ.2 లక్షల వరకే వైద్య ఖర్చులు చెల్లించేవారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ విలీనంతో అదనంగా రూ.3 లక్షల వరకు లాభం చేకూరనుంది. ఈ మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. కొత్త రేషన్ కార్డు నెంబరుతో ఆయుష్మాన్ భారత్‌కు అనుసంధానం చేస్తారు. ఆధార్ కార్డు, గతంలో రేషన్ కార్డుకు అనుసంధానం చేసిన ఫోన్ నంబరు చెప్తే ఓటీపీ ద్వారా పొందుపరుస్తారు. ఏప్రిల్ మాసంలో కార్డులు అందిస్తారు.

దేశంలో ఎక్కడైనా సేవలు..



ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ కార్డు కలిగి ఉంటే దేశంలోని ఏ ప్రాంతంలోనైనా ఉచిత వైద్య సేవలు పొందడానికి అనుకూలంగా పొందుపర్చారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ వేర్వేరుగా ప్రత్యేక కార్డులు అందజేస్తారు. దీంతో 1886 రకాల వ్యాధులకు చికిత్స చేస్తారు. ప్రధానంగా మోకాలి చిప్ప మార్పిడి, కిడ్నీ, గుండె మార్పిడి, కాలేయ వ్యాధులతో సహా చాలా రకాల వ్యాధులకు శస్త్ర చికిత్సలు చేసుకునే వీలుంది. జిల్లాలో 5.32 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉండగా, ఇప్పటి వరకు దాదాపు 82 వేల రేషన్ కార్డులకు చెందిన వారు మాత్రమే ఆయుష్మాన్ భారత్–ఆరోగ్యశ్రీ కార్డు నమోదు చేసుకున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రైవేట్ ఎజెన్సీలకు అనుసంధానం బాధ్యతలు..

శిశువు నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ కార్డు పొందేందుకు అర్హులు. ఈ నెల 31 వరకు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ కార్డు నమోదు కోసం నాలుగు ప్రైవేట్ ఎజెన్సీలకు బాధ్యత అప్పగించారు. గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల వద్ద ప్రైవేట్ ఎజెన్సీలు బాధ్యతలు నిర్వహిస్తుండగా, మేడ్చల్, ఘట్కేసర్, మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య మిత్ర సిబ్బంది అందుబాటులో ఉంటారు. వీరి వద్దకు రేషన్, ఆధార్ కార్డు తీసుకెళ్లి ఫోన్ నంబర్ చెబితే నమోదు చేస్తారు. వ్యక్తి ఫొటో తీసుకుని వివరాలు నమోదు చేస్తారు. రాష్ట్రంలో ఎక్కడైనా నమోదు చేయించుకునే అవకాశముంది.